## క్లుప్తంగా

### పదోన్నతిపై వెళ్తున్న క్యాషియర్‌కు సన్మానం



క్యాషియర్‌ను సన్మానిస్తున్న బ్యాంకు సిబ్బంది

**దహెగాం:** మండల కేంద్రంలోని స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకులో పని చేస్తున్న క్యాషియర్ రవిచైతన్య పదోన్నతిపై ఆదిలాబాద్ జిల్లా సుంకిడికి వెళ్తున్న సందర్భంగా శుక్రవారం బ్యాంకు మేనేజర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మేనేజర్ మాట్లాడుతూ ఉద్యోగంలో బదిలీలు సహజమన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సూరిబాబు, లక్ష్మి, వ్యాపారులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

**వాంకిడి:** మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న మేనేజర్ విష్ణువర్ధన్, ఫీల్డ్ ఆఫీసర్ రవి, అకౌంటెంట్ అనిల్‌లను ఐకేపీ సిబ్బంది శుక్రవారం సన్మానించారు. ఏపీఎం మహేశ్, సీసీలు విఠల్, శ్యాంరావు, భీంరావు, వేణు, సురేందర్ పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కాగజ్‌నగర్‌రూరల్:** పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల నెలవారి మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ కమలాకర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

**రెబ్బెన:** మండలంలోని రెబ్బెన, నంబాల సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం రెబ్బెన, నంబాల సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

**చింతలమానెపల్లి:** మండలంలోని రవీంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రవీందర్ తెలిపారు. రవీంద్రనగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. మండలంలోని బాబాపూర్, అనుకోడ, గంగాపూర్, బాబాసాగర్, చింతలమానెపల్లి, రవీంద్రనగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి పుట్టినరోజు వేడుకలు



పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న సిబ్బంది

**చింతలమానెపల్లి:** మండలంలోని బాబాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను ఆకర్షించడానికి నిర్వాహకురాలు మంతెన శ్రీలత చిన్నారులకు పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన శివాని పుట్టినరోజు వేడుకను అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. గ్రామంలోని చిన్నారులు క్రమం తప్పకుండా హాజరు కావడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా పుట్టినరోజు పండుగ నిర్వహిస్తున్నామన్నారు.

### ఎస్పీని సన్మానించిన బ్రాహ్మణ సంఘం నాయకులు



సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** ఇటీవల జిల్లా ఎస్పీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆసిఫాబాద్ బ్రాహ్మణ సంఘం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను సన్మానించారు. సంఘం అధ్యక్షుడు వైరాగడె మనోజ్‌కుమార్, ప్రతినిధులు సుగుణాకర్‌రావు, రవీందర్, శేషగిరి, సతీశ్, శేఖర్, సంతోష్, ప్రతాప్, సాయి, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### 'నాటుసారా తయారీపై ఉక్కుపాదం'

**రెబ్బెన:** గ్రామాల్లో నాటుసారా తయారీపై ఉక్కుపాదం మోపుతామని ఎక్సైజ్ ఎస్సైలు రమేశ్, సంధ్యారాణి అన్నారు. శుక్రవారం రెబ్బెనలో నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన లావుడ్య రాజేశ్వరి, లావుడ్య రుకుంబాయిలు నాటుసారా తయారు చేసి విక్రయిస్తూ పట్టుబడ్డారు. ఇద్దరి వద్ద నుంచి 10లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. గ్రామానికి చెందిన మరో ముగ్గురు వ్యక్తులను స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

# బూర్గుడ బడి.. సమస్యల ఒడి

- అలంకారప్రాయంగా మరుగుదొడ్లు
- ప్రహరీ కరువు
- సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల నిరసన



నిరుపయోగంగా మరుగుదొడ్లు

**ఆసిఫాబాద్‌రూరల్:** పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన సర్కారు బడులు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామంటున్న అధికారులు, ప్రజాప్రతినిధుల మాటలకు క్షేత్రస్థాయిలో పాఠశాలల పరిస్థితులకు పొంతన లేకుండా ఉంది. మండలంలోని బూర్గుడ ఉన్నత పాఠశాలలో 285 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కానీ పాఠశాలలో కేవలం ఐదు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. అవి కూడా బాలికలు వినియోగిస్తుండగా బాలురు ఒకటికి, రెంటికి బయటకు పోవాల్సిన దుస్థితి నెలకొంది.

**మండలంలోని పాఠశాలల్లో..**

మండలంలో మొత్తం 130 పాఠశాలలకు గాను పీఎస్‌లు 92, యూపీఎస్‌లు 19, హైస్కూల్‌లు 16 ఉన్నాయి. వీటిల్లో సుమారు 11వేల మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో విద్య అభ్యసిస్తున్నారు. 130 పాఠశాలకు గాను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ప్రహరీ లేని పాఠశాలలు 64 ఉన్నాయి. గతంలో పాఠశాల్లో పని చేసిన స్వీపర్లను తొలగించి అదే గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న జీపీ కార్మికులతో రోజు వారీగా పాఠశాలలను శుభ్రం చేయించారు. గత 6 నెలల నుంచి వేతనాలు రాక వారు జీపీ పనులు చేయడం లేదు. దీంతో పాఠశాలల్లో చెత్తాచెదారం పేరుకుపోతుంది. కొంత మంది టీచర్లు విద్యార్థులతోనే పాఠశాలలను శుభ్రం చేయిస్తున్నారు.

**విద్యార్థుల ఆందోళన**



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తమ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం బూర్గుడ పాఠశాల విద్యార్థులు తరగతులు బహిష్కరించి పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు గణితం బోధించే ఉపాధ్యాయుడు అసభ్యకరమైన మాటలతో వేధిస్తున్నారని, ఇష్టానుసారం తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో హెచ్‌ఎం సంబంధిత గణిత టీచర్ వచ్చి విద్యార్థులకు క్షమాపణ చెప్పారు. గణితం సబ్జెక్టుకు మరో టీచర్‌ను కేటాయించామని హెచ్‌ఎం తెలపడంతో విద్యార్థులు ఆందోళన విరమించి తరగతులకు వెళ్లారు.

**మరుగుదొడ్లు లేక అవస్థలు..**

పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇంటింటికి మరుగుదొడ్లు నిర్మించుకోవాలని చెబుతున్న అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం మరుగుదొడ్ల నిర్మాణంపై శ్రద్ధ చూపడం లేదు. మండలంలోని బూర్గుడ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 271 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో బాలికలు 111 మంది, బాలురు 160 మంది ఉండగా 15 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నత పాఠశాల ఉన్నప్పటికీ ఈ పాఠశాలకు ప్రహరీ, మరుగుదొడ్లు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.

**బయటకు వెళ్తున్నాం..**



పాఠశాలలో బాలురకు మరుగుదొడ్లు లేక ఒంటికి, రెంటికి ఊరు దాటి కిలోమీటర్ దూరం పోతున్నాం. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మరుగుదొడ్లు నిర్మించాలి.
– రుత్విక్, 10వ తరగతి

**క్లాసుకు లేట్ అవుతుంది**



పాఠశాలలో టాయిలెట్‌లు సరపడా లేక బయటకు పోయి వచ్చే వరకు ఎక్కువ సమయం పడుతుంది. దీంతో క్లాసు టైంకు పాఠశాలకు రాలేక పోతున్నాం. పాత టాయిలెట్లు ఉన్నా దారిలేక బయటకు పోతున్నాం.
– విజయ్, 10వ తరగతి

## గ్రామాల్లో మొదలైన మొహర్రం సందడి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**రెబ్బెన:** హిందూ ముస్లింలు ఐక్యంగా జరుపుకుంటున్న మొహర్రం వేడుకలతో గ్రామాల్లో సందడి నెలకొంది. మొహర్రం పురస్కరించుకొని గ్రామాల్లో నిలిపిన పీర్ల బంగ్లాల వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మండలంలోని పుంజుమేరగూడలో గల శ్రీ భూవమ్మతల్లి దేవస్థానంలో గురువారం అర్ధరాత్రి ఐదో రోజు పంజాసరిగెత్తు సందర్భంగా పంజా పీరీ లేపారు. పీరీ ఊరేగింపులో భాగంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఇంటికి చేరుకోగా ఎమ్మెల్యే దంపతులు కుటుంబ సమేతంగా పీరీని దర్శించుకొని మలీల ముద్దలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి చిన్న సరిగెత్తు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బంగ్లా నిర్వాహకులు తెలిపారు.

## బడుల్లో జోరుగా 'వన మహోత్సవం'



భీమన్‌గొంది పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

**కెరమెరి:** మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో జోరుగా వనమహోత్సవం కొనసాగుతోంది. మండలంలోని ప్రాథమిక, ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు 56 ఉండగా శుక్రవారం 48 పాఠశాలల్లో 198 మొక్కలు నాటారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నాటిన మొక్కలకు ప్రతిరోజు నీరు పోయాలని, ఇళ్లల్లో కూడా మొక్కలు నాటాలని కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఆడే ప్రకాశ్, చంద్రశేఖర్, భరత్ పేర్కొన్నారు.

**కౌటాల:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీవో మహేందర్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ విస్తారంగా మొక్కలు నాటితేనే సంవృద్ధిగా వర్షాలు కురుస్తాయన్నారు. మాజీ సర్పంచ్ వొజ్జల మానిశ్, హెచ్‌ఎం నారాయణ సింగ్, ఉపాధ్యాయులు రమేశ్, శ్యాంరావు, రయీస్ అహ్మద్, రాంచందర్, లూర్థయ్య, ఎఫ్‌బీవో ప్రభాకర్, కార్యదర్శి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ మండల ఖండ సమితి ఎన్నిక



ఎన్నికైన మండల ఖండ, గ్రామ సమితి కమిటీ

**రెబ్బెన:** మండలంలోని గోలేటి శ్రీ శారద విద్యా మందిర్‌లో శుక్రవారం విశ్వహిందూ పరిషత్ బైటక్ కార్యక్రమాన్ని నిర్వహించి రెబ్బెన మండల ఖండ సమితితో పాటు కైరిగూడ గ్రామ పంచాయతీ సమితిని ఎన్నుకున్నారు. రెబ్బెన మండల ఖండ అధ్యక్షులుగా జర్పుల శివాజీ, కార్యదర్శిగా సాయికుమార్, బజరంగ్ దళ్ ప్రముఖ్‌గా అజ్మీర సందీప్‌లను ఎన్నుకున్నారు. అలాగే కైరిగూడ గ్రామ సమితి అధ్యక్షులుగా లావుడ్య అర్జున్, ఉపాధ్యక్షులుగా కమ్మరి స్వామి, కార్యదర్శిగా లావుడ్య సంతోష్, సత్సంగ్ ప్రముఖ్‌గా అజ్మీర తరుణ్‌లను ఎన్నుకున్నట్లు తాండూర్ ప్రఖండ కార్యదర్శి సతీష్, సహాయ కార్యదర్శి చౌహాన్ సంతోష్‌లు తెలిపారు.

## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ హర్షనీయం



సైకిళ్లు పంపిణీ చేస్తున్న డీఈవో అశోక్

**దహెగాం:** మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయడం హర్షనీయమని డీఈవో అశోక్ అన్నారు. మండలంలోని చినరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దూరప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు శుక్రవారం ఇండియన్ ఫ్రెండ్స్ ఆఫ్ అట్లాంటా ఆధ్వర్యంలో 40 సైకిళ్లు ఉచితంగా అందజేశారు. డీఈవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉంటుందని, వారు ఉన్నత చదువులు చదవాలన్నారు. ఉన్నత స్థాయికి ఎదిగి ఇతరులకు సాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇండియన్ ఫ్రెండ్స్ ఆఫ్ అట్లాంటా ఎన్‌ఆర్‌ఐ సునీల్, సంస్థ ప్రతినిధి నాగేశ్వర్‌రావు, హెచ్‌ఎం సునీత, సహకార సంఘం చైర్మన్ కొండ్ర తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మధుకర్, వీవో అధ్యక్షురాలు సుశీల, పంచాయతీ కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీలక్ష్మీ వారాహిదేవి పూజలు

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం శ్రీ లక్ష్మీ వారాహిదేవి పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. వారాహి నవరాత్రోత్సవం సందర్భంగా అర్చకులు ముదిగొండ రాజశేఖర శర్మ, డిల్లీ విజయ్‌కుమార్, చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ వారాహి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళలు కుంకుమార్చన, సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా అర్చకులు రాజశేఖర శర్మ శ్రీ లక్ష్మీ వారాహి దేవి మహత్యం, ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమానికి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ సదయ్య

**ఆసిఫాబాద్:** చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సదయ్య అన్నారు. మండలంలోని రవిచంద్ర కాలనీలో శుక్రవారం పోలీసుల ఆధ్వర్యంలో 'కమ్యూనిటీ కాంటాక్ట్' కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఐ మాట్లాడుతూ నేరాల నిర్మూళనలో భాగంగానే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించామన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తులు, నేరస్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత చెడు అలవాట్లకు, గంజాయి, మద్యం, డ్రగ్స్‌లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కాలనీలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని, డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని తెలిపారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, ఆత్మహత్యలు, లైంగిక వేధింపులు, గంజాయి వంటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న దురాచారాలు, కొత్త చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. వాంకిడి సీఐ శ్రీనివాస్, రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై రాజేశ్వర్, ప్రవీణ్, సాగర్, చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గుట్కా పట్టివేత

**చింతలమానెపల్లి:** మండలంలోని బాబాసాగర్ గ్రామం శివారులో శుక్రవారం గుట్కా స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పక్కా సమాచారంతో బాబాసాగర్ గ్రామ శివారులో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో కౌటాలకు చెందిన సయ్యద్ హాజీత్ అలీ వద్ద రూ.4382 విలువ గల గుట్కా లభ్యమైంది. గుట్కాను కాగజ్‌నగర్‌కు చెందిన ఇంతియాజ్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలుపగా గుట్కాలు, మోటార్ సైకిల్ సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

## అనాథ పిల్లలకు ఉపాధ్యాయుల ఆర్థిక సాయం

సాక్షి ఎఫెక్ట్..



ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

**కౌటాల:** మండలంలోని పార్డీ గ్రామానికి చెందిన అనాథ పిల్లలకు ఆదివాసీ ఉపాధ్యాయులు శుక్రవారం ఆర్థికసాయం అందించారు. చిన్న తనంలోనే పిల్లలు తమ తల్లిదండ్రులను కోల్పోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఆదివాసీ టీచర్స్ అసోషియేషన్, ఆదివాసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.10,500 ఆర్థికసాయం, నిత్యావసర సరుకులు అందించారు. ఇటీవల సాక్షిలో ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు శీర్షికన ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గావుడె హన్మంతు, సభ్యులు ఆలం ప్రభాకర్, అశోక్, మధుకర్ పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను బడిలో చేర్పించిన ఎస్సై



విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై రమేశ్

**తిర్యాణి:** మండలంలోని మంగి పంచాయతీ పరిధిలోని కోలంగూడ, పాతగూడ, శ్రీరాంపూర్ గూడ గ్రామానికి చెందిన బడీడు పిల్లలను ఎస్సై రమేశ్ బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రమేశ్ మాట్లాడుతూ ఉమ్మడి మంగి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన బడీడు పిల్లలు బడులకు వెళ్లకుండా పనులకు వెళ్తున్నారని గుర్తించామన్నారు. వారి తల్లిదండ్రులకు పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి 8 మంది విద్యార్థులను శుక్రవారం తిరిగి బడిలో చేర్పించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

**రెబ్బెన:** పులికుంట పంచాయతీ పరిధిలోని పాఠశాలల్లో పని చేసి పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులకు శుక్రవారం పులికుంట కాలనీ పాఠశాలలో గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు టి. శ్రీనివాస్ స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించగా సిర్పూర్(టి) హైస్కూల్‌కు బదిలీ కాగా ఉపాధ్యాయులు సూర్యనారాయణ, గురువంత, సరితలు బదిలీపై వేరే పాఠశాలలకు వెళ్లారు. దాంతో గ్రామస్తులు వారిని ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ బుర్స పోషమల్లు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బుర్స లక్ష్మి, నాయకులు ఎర్గటి సుధాకర్, ఎర్గటి గోపాల్, టేకం పోచన్న, తక్కళ్లపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఏఎస్సై మృతి



నారాయణ(ఫైల్)

**లింగాపూర్:** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎన్.నారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. కిడ్నీ, లివర్ సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం విషమించడంతో గురువారం మృతి చెందారు. ఎస్పీ శ్రీనివాసరావుతోపాటు పోలీసుల సంఘం అధ్యక్షుడు విజయ్ శంకర్‌రెడ్డి, సీఐ అంజయ్య, ఎస్సై ప్రవీణ్‌కుమార్ శుక్రవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల కోసం రూ.20,000 ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

## బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రణయ్



నియామకపత్రం అందుకుంటున్న ప్రణయ్

**ఆసిఫాబాద్‌అర్బన్:** ఆర్.కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా ఆవిడపు ప్రణయ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు తుమ్మ రమేశ్ తెలిపారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లో సంఘం నాయకులతో కలిసి ఆవిడపు ప్రణయ్‌కు నియామకపత్రం అందజేశారు. ప్రణయ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, వీరభద్రాచారి, సంతోష్, కోటేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్పీ

**వాంకిడి:** మండలంలోని తొక్కిగూడ గ్రామానికి చెందిన రాజక్క అనే మహిళ గతంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ వైర్లకు తగిలి కంటిచూపు కోల్పోయి ఇటీవల ఆపరేషన్ చేయించుకొని ఇంటికి రాగా శుక్రవారం ఎస్పీ శ్రీనివాస్‌రావు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సదయ్య, సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ తదితరులు ఉన్నారు.

# పారిశుద్ధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..



పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు

**బెజ్జూర్:** గ్రామీణ ప్రాంతాల్లో లోపించిన పారిశుద్ధ్యంపై 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం మండలంలోని ఎలుకపల్లి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి తుకారం ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు గ్రామంలోని మురికి కాల్వల్లోని పూడిక తీయడంతో పాటు దోమల నివారణ కోసం ఫాగింగ్ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

## 'పర్యవేక్షణ లోపంతో నాసిరకం పనులు'



భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మోతీరాం, ధర్మూ

**కెరమెరి:** మండలంలోని గోండ్‌గూడ గ్రామ పంచాయతీ చిత్తగూడ గ్రామంలో జన్‌ధన్ యోజనలో భాగంగా సుమారు రూ.20 లక్షల నిధులతో చేపడుతున్న సమీకృత భవన నిర్మాణం నాసిరకంగా ఉందని మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, పీటీజీ సూపర్‌వైజర్ సిడాం ధర్మూ ఆరోపించారు. శుక్రవారం వారు భవనాన్ని పరిశీలించారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేస్తామన్నారు. నాయకులు అంబారాదు, లాల్‌షావ్, బుచ్చయ్య, పుండలిక్ తదితరులు ఉన్నారు.